నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా వై.వి శివకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహా విశాఖ నగరపాలక సంస్థలో పర్యవేక్షకులుగా పనిచేసే ఆయనకు గ్రేడ్-2 పురపాలక కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లను మరింత సుందరీకరణ చేయడమే లక్ష్యమన్నారు. పారిశుధ్యం విషయంలో ప్రజలకు ఇటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని తెలిపారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా?

మార్చి 8... అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూడా అదే రోజు ముగియనుంది. అప్పటికి కొద్దిరోజుల ముందే అంటే మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి శాసనమండలిలో ప్రవేశించేది ఎవరో తేలనుంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో పోటీ పడుతున్న పది మందిలో విజయగౌరి ఒక్కరే మహిళగా ఉండడంతో, ఆమెను గెలిపించుకుని మహిళా దినోత్సవం చేసుకోవాలని ఉపాధ్యాయులు మరీ ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు భావిస్తుంటే, టిడిపి కూటమి ప్రభుత్వం తీరు మాత్రం మరోలా ఉంది. మహిళలకు సముచిత స్థానం ఇచ్చేది తామేనంటూ గొప్పలు చెప్పే టిడిపి మాత్రం విజయగౌరి విజయాన్ని అడ్డుకోవాలని సర్వశక్తులు ఒడ్డుతోంది.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ పడుతున్న పది మందిలో ఒక్కరే మహిళ
- విజయగౌరిని ఓడించేందుకు వెనుకాడని కూటమి ప్రభుత్వం
- మహిళలను గౌరవిస్తోంది తామేనంటూ టిడిపి గొప్పలు
- ఎన్నికల సమయంలో ఓట్ల కోసం బోలెడు హామీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో మొత్తం పది మంది అభ్యర్థులు ఉన్నారు. వారిలో ప్రోగ్రెసివ్ డెమోక్రటివ్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయగౌరి ఒక్కరే మహిళా అభ్యర్థినిగా ఉన్నారు. మహిళా అభ్యర్థిత్వం ఒక్కటే ఎన్నికల్లో గెలవడానికి అర్హత కాకపోవచ్చు గానీ ఆమె ఉద్యమ నేపథ్యం మాత్రం కచ్చితంగా విజయం సాధించడానికి దోహదపడనుందన్న చర్చ సాగుతోంది. ఆమె ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన నాటి నుంచి నేటివరకు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల కోసం పనిచేస్తూనే ఉన్నారు. 2005లో 300 మంది ఉపాధ్యాయుల అక్రమ బదిలీల నిలుపుదల కోసం సాగిస్తున్న పోరాటంలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పర్యటనలో పోలీసుల వలయం ఛేధించుకుని మరీ సిఎం దృష్టికి తీసుకువెళ్లి, వాటిని రద్దు చేయడంలో తెగువ ప్రదర్శించారు. ఈ ఒక్క ఘటన చాలు ఉపాధ్యాయుల సమస్యలపై ఆమె సాగించిన చిత్తశుద్ధి, పోరాటం ఏపాటిదో తెలుస్తోంది. ఇటువంటి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు ఉపాధ్యాయుల హృదయాల్లో ఆమెకు సుస్థిర స్థానాన్ని సంపాదించి పెట్టాయి.

విజయాన్ని నిలువరించేందుకు టిడిపి నానా ప్రయత్నాలు

పిడిఎఫ్ తరుపున ఎన్నికైన ఎమ్మెల్సీలు మాత్రం అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా... ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకులు, పట్టభద్రులు, ప్రజా సమస్యలే అజెండాగా గళం ఎత్తుతున్నారు. శాసనమండలిలో ఆయా తరగతుల గొంతు వినిపించడంతో పాటు ఉద్యమాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా భాగస్వామ్యమవుతూ చాలా ఏళ్లుగా అందరి ఆదరాభిమానాలను చూరగొంటున్నారు. పిడిఎఫ్ అభ్యర్థిగా ప్రస్తుతం బరిలో ఉన్న విజయగౌరి ఉద్యమ నేపథ్యం మండలిలో పిడిఎఫ్ పోరాటాలకు మరింత బలం అవుతుందని గుర్తించిన టిడిపి కూటమి ప్రభుత్వం, ఆమెను ఎలాగైనా ఓడించేందుకు రకరకాల ప్రయత్నాలు సాగిస్తోంది. ఎపిటిఎఫ్ తరుపున రెండోసారి బరిలో దిగిన పాకలపాటి రఘువర్మను తమ సొంత అభ్యర్థిగా భావించి గెలిపించుకునేందుకు పరితపిస్తోంది. ఓటర్లను నయానో, భయానో లొంగదీసుకుని గెలిచేందుకు శతవిధాలా ప్రయత్నాలు సాగిస్తోంది.

టిడిపి ద్వంద్వవైఖరి

మహిళల విషయంలో టిడిపి ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మహిళలకు టిడిపి ప్రభుత్వం మాత్రమే సముచిత గౌరవం ఇస్తోందంటూ ఎన్నికలు, ఇతర సందర్భాల్లో గొప్పలు చెప్పున్న ఆ పార్టీ పదవులు, ఎన్నికల సమయంలో మాత్రం వారు గుర్తుకు రాకపోవడడం గమనార్హం. గత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఎనిమిది స్థానాలకు గాను ఒక్క పలాసలోనే టిడిపి మహిళకు అవకాశం కల్పించింది. అక్కడా మరో వ్యక్తిని పరిశీలించి, చివరకు మూడో విడతలో శిరీషకు టికెట్ కేటాయించింది. ఇప్పుడు ఉత్తరాంధ్ర నుంచి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి తొలిసారి ఓ మహిళ పోటీ పడుతుంటే, ఆమెను శాసనమండలిలో అడుగు పెట్టనీయకుండా అడ్డుకునేందుకు అవసరమైన అన్నిరకాల ప్రయత్నాలు సాగిస్తోంది. కూటమి ప్రభుత్వ కుయుక్తులను మేధావులు, విద్యావంతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు గమనిస్తున్నారు. శాసనమండలి ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

లే ఆఫ్ నోటీస్‌ను ఉపసంహరించుకోవాలి

- సిఐటియు డిమాండ్
- తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - రణస్థలం

శ్యామ్‌పిస్టన్స్ పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన అక్రమ లే ఆఫ్ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని వరిశాంలో గల శ్యామ్‌పిస్టన్స్ ప్లాంట్-2 పరిశ్రమలో లే ఆఫ్ చేయకుండా యాజమాన్యాన్ని ఆదేశించాలని, బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ వేతనాలు, బోనస్, చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఇవ్వాల్సిన చెల్లింపులు వెంటనే చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఆ పరిశ్రమ కార్మికులు జాతీయ రహదారి జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ యాజమాన్యం 200 మంది కార్మికులను మార్చి 1వ తేదీ నుంచి లే ఆఫ్ చేయటం కోసం ప్రభుత్వ అనుమతికి దరఖాస్తు చేసిందని తెలిపారు. దీంతో కార్మికులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ విధమైన లే ఆఫ్‌లు చేయొద్దని యాజమాన్యాన్ని ప్రభుత్వం ఆదేశించాలని కోరారు. వేతనాలు సకాలంలో చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెట్టి రెచ్చగొట్టి సమస్యను సృష్టించేందుకు యాజమాన్యం చూస్తోందని చెప్పారు. దాన్ని యూనియన్‌పై నెట్టాలని అనేక ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదేశించినా చెల్లించలేదని తెలిపారు. ఐదేళ్లుగా బోనస్ చెల్లించడం లేదని, గత అక్టోబరులో చెల్లించాల్సిన బోనస్ నేటికీ చెల్లించలేదన్నారు. 30 ఏళ్ల సర్వీసు పూర్తయిందని కార్మికులను బలవంతంగా రిటైర్మెంట్ చేయిస్తున్నారని, ఇప్పటివరకు అక్రమంగా 80 మంది కార్మికులను బలవంతపు రిటైర్మెంట్ చేశారని చెప్పారు. ఇదే జీవనాధారంగా ఉన్న కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బలవంతపు రిటైర్మెంట్ నిలుపుదల చేసి, అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికులకు ఇస్తామన్న హెల్త్ కార్డులు ఇవ్వలేదని, చనిపోయిన కార్మిక కుటుంబాలకు చెల్లించాల్సిన చెల్లింపులు చెల్లించలేదని విమర్శించారు. ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను వెంటనే నెరవేర్చి, వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామని, మార్చి మూడో తేదీన చలో కలెక్టరేట్ చేపడతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రావణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలనర్సయ్య, గొర్లె కిరణ్, నాయకులు వెలమల రమణ, ఆర్.ఎస్ నాయుడు, కె.భోగేష్, ఎన్.నాగేశ్వరరావు, గురు ఈశ్వరరావు, గొర్లె కృష్ణ, వి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

శ్రీకాకుళం అర్బన్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎ.గణేష్, ఎన్.బలరాం, సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తుందని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని ఎంతగానో ఆశించామన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ఆప్కాస్‌ను రద్దు చేసి మమ్ముల్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దన్నారు. మున్సిపాల్టీలను పరిశుభ్రం చేసి, ప్రజల అవసరాలు తీర్చడమే గాక ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించడానికి తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలు చేస్తున్నామని తెలిపారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారం, జాతీయ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు జాతీయ సెలవులు వర్తింపజేయాలన్నారు. నగర విస్తీర్ణ పరిధి పెరిగిందని, అందుకనుగుణంగాకార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. పుష్ కాట్స్, బిన్‌లు, ఇతర పనిముట్లు వెంటనే అందించాలని, బళ్ల మరమ్మతులు చేయాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు, కమిటీతో ప్రతినెలా సమావేశాలు నిర్వహించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ రాష్ట్రవ్యాప్త సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తానని, స్థానిక సమస్యలపై మార్చి మొదటివారంలో సమావేశం నిర్వహిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.శంకర్, ఎ.శేఖర్, ఎ.జనార్ధనరావు, ఎన్.పార్వతి, టి.ఇందు, శంకర్ గణేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకటేశ్వరరావు

ఎన్నికల విధులపై అప్రమత్తం

- ప్రశాంత వాతావరణంలో పోలింగ్
- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులపై సంబంధిత పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వహించే పిఒ, ఎపిఒలకు రెండో విడత శిక్షణా తరగతులను సోమవారం నిర్వహించారు. పోలింగ్ కేంద్రంలో విధులు, పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్సులు తెరవడం, సీల్ చేయడం వంటి అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి ఎన్నికల సిబ్బంది నుంచి సమాధానాలను రాబట్టి సందేహాలు నివృత్తి చేశారు. ఈనెల 27న ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం పది మంది అభ్యర్థులు పోటీల్లో ఉన్నారని వివరించారు. అందుకు సంబంధించిన బ్యాలెట్ పేపర్‌ను ఏవిధంగా మడతపెట్టి బ్యాలెట్ బాక్సులో వేసే విధానం గురించి వివరించారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు స్వీకరణ, స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ కవర్లు, పోలింగ్ మెటీరియల్స్ చెక్‌లిస్టు ప్రకారం పరిశీలించుకుని తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 5,035 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఇందులో పురుషులు 3,416 మంది కాగా మహిళలు 1619 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల పోలింగ్ సంబంధించి పిఒ, ఎపిఒలు ఎన్నికల సంఘం సూచించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా చదివి అవగాహనతో పకడ్బందీగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను ముగించాలని తెలిపారు. శిక్షణా కార్యక్రమం ద్వారా బ్యాలెట్ బాక్స్ ఆపరేటింగ్, బ్యాలెట్ పేపర్ల పరిశీలన, పిఒ డైరీ నిర్వహణ ముఖ్యమైన ఘట్టాలని తెలిపారు. గత ఎన్నికల్లో అనుభవాన్ని జోడించి సజావుగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. శిక్షణా తరగతుల్లో శ్రీకాకుళం, టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్ల అధికారులు సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, జి.వెంకటేష్, ఉప కలెక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే అజెండా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - భోగాపురం, వేపాడ, జామి

ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే తన అజెండా అని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి తెలిపారు. సోమవారం భోగాపురం, జామి, వేపాడ మండలాల్లో ఆమె విస్తృతంగా ప్రచారం చేపట్టారు. భోగాపురం ఉన్నత పాఠశాల, ఎపి మోడల్ స్కూల్, రావాడ, పోలిపల్లి ఉన్నత పాఠశాలల్లోను, జామి జెడ్‌పి ఉన్నత పాఠశాల, వేపాడ మండలంలో కెజిబివి, ఆదర్శ పాఠశాల, గురుకులంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బొద్దాం, సోంపురం ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకుని, కచ్చితంగా వాటి పరిష్కారానికి తనవంతు సాయశక్తులా కృషి చేస్తానని హామీఇచ్చారు.

అవకాశమిస్తే ఉపాధ్యాయుల గొంతునవుతా

ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే విధాన మండలిలో ఉపాధ్యాయుల గొంతును వినిపిస్తానని విజయగౌరి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై గత కొన్నేళ్ల నుంచి పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలను దగ్గర నుంచి చూసిన తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతానని అన్నారు. చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీయని వారికి ఓటు వేసి గెలిపించినా ఉపయోగం లేదన్నారు. గతంలో పనిచేసిన వారంతా సమస్యను గాలికి వదిలేసి ప్రభుత్వాలకు అనుగుణంగా ఉండడంతో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల గొంతు రాష్ట్రంలో వినిపించ లేదని అన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల వల్ల విద్యా శాఖలో అపారమైన నష్టం జరిగిందని అన్నారు. మొదటిసారిగా పెద్దల సభకు ఒక మహిళగా ప్రాతినిధ్యం చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ ఓటర్లంతా విజయగౌరికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు, వేపాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పిన్నింటి వెంకటరమణ, ఇమంది జగదీశ్వరరావు, కోశాధికారి పి.చిరంజీవి, సీనియర్ నాయకులు ఎస్‌విఎన్ స్వామి, డి.జగదీష్, ప్రసాద్, సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్, భోగాపురం యుటిఎఫ్ నాయకులు పి.చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వైకుంఠరావు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయగౌరి

'పది' విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వచ్చే నెల 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారని, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశించారు. నగరంలోని బి.కాలనీలో ఉన్న సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయంలో విద్యాశాఖ, కెజిబివి, మోడల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో, ఎస్ఒలతో సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు, అందులో బాలికలు, బాలురు ఎంత మందని డిఇఒ తిరుమల చైతన్య, ఎపిసి ఎస్.శశిభూషణరావులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు కేటాయించారని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా తాగునీటి సదుపాయం, చక్కని వెలుతురు, పరిశుభ్రవంతమైన మరుగుదొడ్లు, ఫ్యాన్లు, సరిపడినన్ని బెంచ్‌లు, కుర్చీలు ఏర్పాటు చేసేలా సంబంధిత పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. పరీక్షలు నిర్వహించనున్న కేంద్రాల పరిధిలో విద్యుత్, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారా? అని అడిగారు. రవాణా ఇబ్బందులు లేకుండా సరిపడా బస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆర్‌టిసి అధికారుల దృష్టికు వెళ్లారా? అని అన్నారు. టౌన్‌లో వివిధ రద్దీ కూడళ్లల్లో టాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసుశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ప్రాథమిక వైద్యంతో అనుసంధానంగా ఉండేలా సరిపడా మందులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడాలన్నారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలపై దృష్టిపెట్టాలన్నారు. డిఇఒ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుండి 28,934 విద్యార్థులు హాజరుకానున్నారని అన్నారు. శశిభూషణరావు మాట్లాడుతూ అన్ని కెజిబివిల్లో చక్కని ఉత్తీర్ణత సాధించేలా పాఠశాలలను సందర్శించి తగు సలహాలు, సూచనలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకట రమణ, ఎంఇఒలు ఎం.వాసుదేవకుమార్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

విజయగౌరికి 'అరసం' మద్దతు

శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరికి మద్దతు ఇస్తున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నల్లి ధర్మారావు, చింతాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. నిబద్ధత గల ఉద్యమ నాయకులను బుద్ధిజీవులైన ఉపాధ్యాయులు ఎన్నుకోవాలని కోరారు. మేధావి వర్గానికి చెందిన వారు అభ్యర్థుల సామాజిక నిబద్ధత, ప్రజాపక్ష బాధ్యతను గమనించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఉపాధ్యాయ ప్రతినిధులుగా ఎన్నికైన వారు ఏ ప్రభుత్వం ఏర్పడితే, వాటికి కొమ్ముకాసే అవకాశవాదులుగా మారిపోయా రని గుర్తుచేశారు. తాత్కాలిక ప్రలోభాలకు ఉపాధ్యాయ సమాజం లొంగిపోదనే నమ్మకం అభ్యుదయ రచయి తల సంఘానికి ఉందని పేర్కొన్నారు. ఉద్యమ కుటుంబానికి చెందిన విజయగౌరి ఎన్నిక అవకాశవాద అభ్యర్థులకు చెంపపెట్టు కావాలని కోరారు. శాసనమండలిలో పిడిఎఫ్ అభ్యర్థులు మేధావి వర్గం తరుపున ఎంత చిత్తశుద్ధితో పనిచేశారో విద్యావంతులకు తెలియంది కాదని గుర్తుచేశారు. అభ్యుదయ రచయితల సంఘంతో పాటు జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షునిగానూ విజయగౌరికి మద్దతు ప్రకటిస్తున్నట్లు ధర్మారావు తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మెళియాపుట్టి: రహదారి అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. మండలంలోని మెళియాపుట్టి-పాతపట్నం ఆల్ ఆంధ్రా రోడ్డును సోమవారం పరిశీలించారు. ఈ రోడ్డును రెండు వరుసలుగా విస్తరించేందుకు గానూ సిరియాకండి వద్ద సోమవారం పరిశీలించారు. అందుకు సంబంధించిన వివరాలను ఆర్అండ్‌బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆల్ ఆంధ్ర రోడ్డు మరమ్మతుల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, ఇఇ రవి నాయక్, డిఇ ఎం.ఎల్.వి సాగర్, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి

మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మహా శివరాత్రి రోజున శైవ క్షేత్రాలకు తరలివచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈనెల 26న నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచీ వేలాదిగా టెక్కలి ఎండల మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చేస్తారని, మరో ప్రముఖ శైవ క్షేత్రం శ్రీముఖలింగం, ఉమారుద్ర కోటేశ్వర ఆలయానికి వస్తారని తెలిపారు. యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని క్యూలైన్ల ఏర్పాట్లు, భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, మజ్జిగ అందించాలని, ఏర్పాట్లలో ఎక్కడా ఏ లోటూ రాకుండా చూడాలని సూచించారు. పోలీసు యంత్రాంగం అప్రమత్తమై యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వామి దర్శనం శీఘ్రంగా, సులభరీతిలో జరిగే విధంగా ఏర్పాట్లు చేయడంతో పాటే ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రథసప్తమి వేడుకల స్ఫూర్తిని నింపుకుని యంత్రాంగం పనిచేసి మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.

IN THE HON'BLE COURT OF THE SENIOR CIVIL JUDGE, SOMPETA. O.S.41/2018.

Between:
M. Divya Kumari. ......Plaintiff
And:
P. Mallayya And Others. ......Defendants

To,
D-6: P. Lavanya, W/o Prabhu Kumar, Aged 42 years, House-hold duties, resident of Door No.5-742, Ambusoli village, P.O: Kasibugga, Palasa Mandal, Srikakulam Dist.
D-7: Ch. Deepithi, W/o Murali, aged 40 years, House-hold duties, resident of Door No.5-742, Ambusoli village, P.O: Kasibugga, Palasa Mandal, Srikakulam Dist.

Please take notice that the plaintiff filed the above suit for declaration and recovery of possession against you and others and it stands posted to **27-02-2025 at about 10-30 A.M.** in the above court for your appearance, you appear either in person or through your Advocate on that day, failing which the matter will be decided as per law.

// BY ORDER //

**K.S. PRASAD BABU
ADVOCATE,
SOMPETA, SRIKAKULAM DIST.**

నేత్ర వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

నేత్రాలపై శ్రద్ధ అవసరం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పోలీసు సిబ్బందికి కంటిచూపు చాలా ముఖ్యమని, కంటి ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, క్రమం తప్పకుండా తనిఖీ చేయించుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి, విజయనగరం సౌజన్యంతో పోలీసు సిబ్బందికి ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న పలువురు పోలీసు కానిస్టేబుళ్లతో పాటు, జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయం, డిసిఆర్‌బి, ఎస్‌బి, ఇతర విభాగాల మినిస్ట్రియల్, పోలీసు సిబ్బందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎస్‌పి మాట్లాడుతూ మానవ శరీరంలో కళ్లప్రధానమైనవని, నేత్రాలపై నిర్లక్ష్యం వహించకుండా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బందికి ఉచిత నేత్ర పరీక్షలు చేయడానికి ముందుకు వచ్చిన శ్రీ పుష్పగిరి కంటి ఆస్పత్రి యాజమాన్యానికి, వైద్యులకు ఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 175 మంది పోలీస్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి. రమణ, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస్, సిఎస్‌ఆర్ మేనేజర్ రమాదేవి, వైద్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- ఆమదాలవలస

కోచ్‌తో నికేష్ నాయుడు

జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో పట్టణంలోని రెండవ వార్డు ఊసవాని పేటకు చెందిన పి.నికేష్ నాయుడు, బి.హేమ సాయి సత్తా చాటారు. ఈ నెల 23న హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ వెపన్ పోటీల్లో జిల్లా నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన పి.నికేష్ నాయుడు బంగారు పతకం సాధించగా, వాణి హైస్కూల్‌కు చెందిన బి.హేమ సాయి కాంస్య పతకం సాధించాడు. ఈ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల్లో జిల్లాకు నలుగురు పతకాలు సాధించగా వారిలో ఇద్దరు ఆమదాలవలస పట్టణానికి చెందినవారు కావడం విశేషం. జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన నికేష్ నాయుడు, కోచ్ నక్క లక్ష్మణ నాయుడును సోమవారం సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ మందన అభినందించారు.

తొలగిస్తున్న ఆక్రమణ పశువుల షెడ్

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాల మైదానం ఆక్రమణలకు గురైన విషయం విదితమే. ఇటీవల పాఠశాల ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్, పశువులు షెడ్డు నిర్మాణలపై 'ప్రజాశక్తి' పలు కథనాలు ప్రచురించడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. పాఠశాల మైదానంలో సర్వే చేసి ఆక్రమణలు అక్రమ కట్టడాలపై సమగ్రమైన రిపోర్ట్ ఇవ్వాలని, ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించారు. షాపింగ్ కాంప్లెక్స్, పశువుల షెడ్డు మొత్తం పాఠశాల స్థలంలోనే అక్రమ కట్టడాలు చేపట్టినట్టు నిర్ధారించారు. రెవెన్యూ అధికారులు ఆక్రమించిన వారందరూ వెంటనే ఖాళీ చేయాలని, లేకుంటే తామే జెసిబితో తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో పాఠశాల స్థలంలో నిర్మించిన పశువుల షెడ్‌ను బారుకుల బుజ్జి సోమవారం రేకులషెడ్‌ను తానే స్వయంగా తొలగించే పనులు చేపట్టాడు. షాపుల యజమానులు మాత్రం ఇంకా తొలగింపు పనులు చేపట్టలేదు. సోమవారం విఆర్‌ఒ వేణు గోపాలరావు మరలా స్వచ్ఛందగా తొలగించకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో కొంతమంది షాపుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వండిన చికెన్‌ను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

చికెన్ వంటలపై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూతో చికెన్ ఉత్పత్తుల వంటకాలు తినడంపై ప్రజల్లో ఉన్న అపోహలను పోగొట్టడానికి వెన్‌కాబ్ చికెన్ సంస్థ సోమవారం మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వండిన చికెన్, గుడ్లను ఉచితంగా పంచిపెట్టారు. మండల కేంద్రం అంబేద్కర్ కూడలిలో స్టాల్ ఏర్పాటు చేసారు. 70 డిగ్రీలపైన ఉడికించి వండిన చికెన్, గుడ్లు తినడం వలన ఎటువంటి ప్రమాదం ఉండదని వెన్‌కాబ్ ప్రతినిధులు తెలిపారు. చికెన్ 100 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలో ఉండడం జరుగుతుందన్నారు. ఈ స్టాల్‌ను మండల టిడిపి అధ్యక్షులు రామ్మోహన్, సర్పంచ్ ఆర్,లక్ష్మి, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్ ప్రారంభించారు. పొందూరు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది చికెన్ కోసం ఎగబడ్డారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని మాణిక్యపురం 11 కెవి ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. మాణిక్యపురం పంచాయతీ పరిధిలో గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫ రాలో అంతరాయం ఏర్పడు తుందన్నారు. వినియోగ దారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

నూతన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఐటి విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సుధీర్‌కుమార్ 'ప్రోబబుల్టీ అండ్ క్యూయింగ్ తీరీ' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తన ఛాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఇంజినీరింగ్ చెందిన అన్ని కోర్సుల విద్యార్థులకు ఎంతగానో ఈ నూతన పుస్తకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఐడి డాక్టర్ బాలక రమేష్‌నాయుడు, ప్రొఫెసర్ డాక్టర్ జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాల, కళాశాల సమీపంలో అసాంఘిక కార్యకలాపాలు

- పెడదారి పడుతున్న కొందరు విద్యార్థులు
- ప్రోత్సహిస్తున్న కొంతమంది షాపుల నిర్వాహకులు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటున్న స్థానికులు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్‌పి పాఠశాల సమీపంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్భయంగా జరుగుతున్నాయి. పాఠశాల, కళాశాలలకు చెందిన కొందరు విద్యార్థులు పెడదారిన పడుతూ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రార్థనా ప్రాంతాలనూ వదలడం లేదు. వీరి కార్య కలాపాలకు జెడ్‌పి పాఠశాల వద్ద ఉన్న కొంతమంది షాపుల నిర్వాహకులు తమ స్వార్థం కోసం ఆ జంటల వద్ద డబ్బులు తీసుకుని వారి కార్యకలాపాల కోసం షెల్టర్ కల్పిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారం కళాశాల, పాఠశాల పని సమయంలోనే జరగడంతో కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల హెచ్‌ఎం, అధ్యాపకులు, సిబ్బంది కనీసం పట్టించు కోకపోవడంతో ఇటువంటి ఘటనలు చోటు చేసు కుంటున్నాయని పలువురు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఇటీవల కొంతమంది విద్యార్థినిలు సిగరెట్లు కాల్చుతున్నట్లుగా, మరికొంత మంది విద్యార్థుల తరగతి

గదిలోని పుస్తకాల బ్యాగుల్లో సిగరెట్ పెట్టెలు బయట పడ్డాయి. ఈనెల 18న ఉదయం 11 గంటల సమయంలో సుభద్రాపురం, చీపురుపల్లి ప్రధాన రహదారికి అనుకుని ఉన్న ఓ ప్రార్థనా మందిరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అత్యంత సమీపంలోనే కళాశాలకు చెందిన విద్యార్థులు అసాంఘిక కార్యక్రమంలో పాల్గొనడం దానిని కొంతమంది వారికి తెలియకుండా తీసిన ఫోటోలు, వీడియోలు కొంతమంది వద్ద ఉన్నట్లుగా స్థానికులు చెబుతుండగా మరికొంత మంది తాము చూసినట్లుగా చర్చించుకుంటున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో సుభద్రాపురం, చీపురుపల్లి ప్రధాన రహదారిపై నిత్యం వాహనాలు, ప్రజలు రాకపోకలు జరిగే చోట ఇలా అసాంఘిక కార్యక్రమాలు జరగడం, ఇటువంటి వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతోనే జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి కఠినమైన చర్యలు తీసుకొని విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడకుండా పాఠశాల, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి అడ్డుకట్ట పడేలా విద్యాశాఖాధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విజయగౌరిని గెలిపించాలి

శ్రీకాకుళం అర్బన్ : విజయగౌరికి మద్దతు తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళా ఉద్యమ నాయకులు కె.విజయ గౌరిని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం యుటిఎఫ్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ మహిళా నాయకులు, పలు అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్‌కు అండగా నిలవాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకురాలిగా కాకుండా సామాజిక బాధ్యతతో అనేక మహిళా ఉద్యమాల్లో ఆమె భాగస్వామ్యమయ్యారని, రానున్న రోజుల్లో మహిళల తరపున ఆమె వాణి చట్టసభలో వినిపించేందుకు వీలుగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సూర స్వర్ణకుమారి, పూర్వ జిల్లా కార్యదర్శి పి.వసుంధర దేవి, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కోరాడ శాంతి ప్రియ, మహిళా విభాగం నాయకులు ఎ.అన్నపూర్ణ, పొన్నాడ స్వరాజ్యలక్ష్మి, లక్ష్మీప్రభ పాల్గొన్నారు.

కొత్తూరు: ఈ నెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్, ఇతర సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి జి.మాధవరావు, మండల అధ్యక్షులు కె.విజయ్ కుమార్‌లు ఉపాధ్యాయులను, అధ్యాపకులను కోరారు. మండలంలోని మెట్టూరులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. విజయగౌరి విద్యార్థిగా ఉన్నప్పుడే విద్యార్థుల సమస్యలపై, ఎస్ఎఫ్ఐ ఉద్యమాల్లో పాల్గొని నాయకత్వం వహించారని అన్నారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో మొదటి నుంచీ ఉపాధ్యాయ ఉద్యమాల్లో, విద్యారంగం పరిరక్షణకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీల జోక్యం, రాజకీయ నాయకులు పాఠశాలలకు వచ్చి ప్రచారం చేయడం సరైందన్నారు. ఉపాధ్యాయులకు మాత్రమే జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు అన్నారు. సమావేశంలో ఆర్.ఆర్.కొండలరావు, మండల

కొత్తూరు : మాట్లాడుతున్న ప్రకాశరావు

కోశాధికారి బి.భద్రయ్య, కార్యదర్శి పి.దినేష్, సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

విజయగౌరికి మద్దతుగా ప్రచారం

మందస : ప్రచారం చేస్తున్న మహిళా అధ్యాపకులు

టెక్కలి : ప్రచారం చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

మందస : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఏలూరు జిల్లా నుంచి వచ్చిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొర్రా సుభాషిని, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, మహిళా నాయకులు పి.స్వరాజ్యలక్ష్మి, ఎ.అన్నపూర్ణ పిలుపునిచ్చారు. మండలంలోని హరిపురం, జి.ఆర్.పురం ఉన్నత పాఠశాలలు, కెజిబివి, హరిపురం గీతం టాలెంట్ పాఠశాలల్లో విజయగౌరి గెలుపు కోసం ప్రచారం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా రంగంలో రకరకాల సంస్కరణలు అమలు చేస్తున్నారని అన్నారు. 117 జిఒ రద్దు చేసినా విద్యా రంగంలో సరైన ప్రత్యామ్నాయలు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు పాల్గొన్నారు.

టెక్కలి : ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరుతూ యుటిఎఫ్ మహిళా విభాగం సోమవారం వినూత్నరీతిలో ప్రచారం చేశారు. మండలంలోని సీతాపురం, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి నుదుటిన బొట్టు పెట్టి విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర మహిళా కార్యదర్శి సుహాసిని, జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, కురమాన దాలయ్య, టెక్కలి మండల నాయకులు బి.లత, ఆర్.జ్యోతి, ఆర్.శారద, వై,రమణమ్మ, తమ్మినేని వైకుంఠరావు, పి.గణపతిరావు, మారం కుమారస్వామి, సకలాభక్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి

ఘనంగా పాఠశాల సంసిద్ధత మేళా

ప్రజాశక్తి- కవిటి

అంగన్వాడీలకు ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐదో రోజు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంసిద్ధత మేళాను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఐసిడిఎస్ సిడిపిఒ నాగరాణి పాల్గొని మాట్లాడారు. సంసిద్ధత మేళాలు అనేవి అంగన్వాడీ, పాఠశాలలో నూతనంగా ప్రవేశించబోతున్న విద్యార్థినీ విద్యార్థుల్లో శారీరక, మానసిక, సామాజిక, ఉద్వేగ అభివృద్ధి రంగాల్లో వారి స్థాయిని అంచనా వేసేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం వారి ప్రగతిని తల్లిదండ్రులకు అంద జేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌పి సిబ్బంది, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎన్నికల కోడ్ అనంతరం గ్రామాల వారీగా సమస్యలు తెలుసుకుంటానన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా తనకు నేరుగా వచ్చి కలిసి సమస్యలు విన్నవించుకుంటే పరిష్కారం జరిగే సమస్యలను తక్షణమే పరిష్కరించ బడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణ దానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నేటి కాలంలో రక్తదానం మహాదానంగా నిలుస్తుందని, రక్తదానం మరొకరి జీవితానికి వెలుగును ప్రసాదిస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సాహుకారి అన్నపూర్ణమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు సాహుకారి నాగేశ్వరరావు ఆధ్వర్యాన రెడ్‌క్రాస్ భవనంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా అన్నపూర్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలతో సమానమన్నారు. మూడు నెలలకోసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. జనసేన నాయకులు, ప్రముఖ గైనిక్ వైద్యులు దానేటి శ్రీధర్ మాట్లాడుతూ సాహుకారి నాగేశ్వరరావు స్నేహశీలి అని, తన తల్లి జయంతి రోజున ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం

రక్తదానం చేస్తున్న యువకులు

అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అన్వేష్, స్వాతి, పోలుమహంతి ఉమా మహేశ్వర రావు, రాయితీ చంద్రశేఖర్, శాంతారావు, శ్రీనివాస్ పట్నాయిక్, నిక్కు అప్పన్న, బలివాడ మల్లేశ్వరరావు, పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు యువత రక్తదానం చేశారు. వారికి మెమెంటో లను, రెడ్‌క్రాస్ తరపున మెడల్స్‌ను బహుకరించారు.

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులకు అభినందనలు

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పురుషోత్తపురం ఆదర్శ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ దుంపల వెంకటరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారిని అభినందించారు. పాఠశాలలో చదువుతున్న గెద్దాడ యామిని కుసుమ, పట్నాన ఝాన్సీ, బొగిలా భాగ్యశ్రీ, బండారు చంద్రికలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు విజయానికి కారణమైన ఉపాధ్యాయులు వి.బి.ఆర్.కృష్ణన్, పంచాది వెంకట్రావు, కొట్యాడ రమణ, జి.శివప్రసాద్ -సోషల్ వారిని మరియు విద్యార్థులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్ షిప్ అందుకుంటారని తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఇచ్ఛాపురం : ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించిన ఇచ్ఛాపురంలోని పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ ఎన్.వెంకటరావు సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ పోలింగ్ పరిధిలో 111 ఓట్లు ఉన్నాయని అన్నారు. ఈయన వెంట రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

సూచనలు ఇస్తున్న తహశీల్దార్ వెంకటరావు

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి సర్వే నంబరు 51 సూదికొండ దరి పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని ఆక్రమణల తొలగింపు చర్యలు రెండో రోజు కొనసాగాయి. ఆదివారం ఆక్రమించిన స్థలంలో పునాదులు, దిమ్మలు వరకు తొలగించారు. సోమవారం పెద్ద పెద్ద పునాదులు, భవనాలు ప్రొక్లెయినర్ సహాయంతో తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, కాశీబుగ్గ సిఐ పి,సూర్యనారాయణ ఆధ్వర్యాన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తొలగింపు చర్యలు చేపడుతున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయానికి పదెకరాలు స్థలం కావాల్సి ఉండగా, ఈ ప్రాంతంలో 9,10 ఎకరాలు డి.పట్టా భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ పక్రియ మంగళవారం నాటికి పూర్తి స్థాయిలో ఆక్రమణలు తొలగించి చదును చేసి పబ్లిక్ హెల్త్ శాఖకు రెవెన్యూశాఖకు అప్పగించనున్నారు.

బలైన పేదలు

పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలో అధికారులు చేపడుతున్న ఆక్రమణల తొలిగింపు చర్యల్మోల నిరుపేదలు

తొలగింపు చర్యలు చేపడుతున్న అధికారులు

బలైపోయారు. భూ దళారులు కాసుల కక్కుర్తి, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగా సర్వే నంబరు 51లోని భూమిని ఆక్రమించుకోని తమకు రెవెన్యూ పట్టా ఉందని అమ్మకాలకు పెట్టారు. తక్కువ ధరకే ఇంటి స్థలం దొరుకుతుందని ఆశపడిన పేదలు బంగారం తాకట్టు పెట్టి, అప్పులు చేసి భూ దళారులకు రూ.లక్షలు చెల్లించారు. దళారులు అడ్డదారిలో వారికి రిజిస్ట్రేషన్లు చేయించి స్థలాలను అప్పగించారు. ఈ స్థలం తమది అనిపించుకునేందుకు మరింత అప్పులు చేసి పునాదులు, చిన్నపాటి రేకుషెడ్లు నిర్మించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ఆక్రమణ తొలిగింపుపై ప్రత్యేక దృష్టి సారించడం, కేంద్రీయ విశ్వవిద్యాలయానికి స్థలం అవసరం కావడంతో రెవెన్యూ అధికారుల కన్ను ఈ సర్వే నంబరు 51పై పడడంతో తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఈ ఆక్రమణలు తొలిగింపు చర్యల్లో భాగంగా చాలా మంది నిరుపేదల బతుకులు రోడ్డున పడ్డాయి. దళారులు చేసిన తప్పుడు పనులకు తాము బలైపోయామని కన్నీటిపర్యంతమవుతున్నారు. తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులను కోరుతున్నారు.

సౌదీ అరేబియాలో ఎం.మారువాడ వాసి మృతి

రామారావు (ఫైల్)

సంతబొమ్మాళి : మండలంలోని ఎం.మరువాడకు చెందిన కొవిరి రామారావు (47) సౌదీ అరేబియాలో ఆదివారం రాత్రి కడుపు నొప్పితో మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారని భార్య పొలమ్మ, సోదరుడు శ్రీనివాసరావు తెలిపారు. 3 నెలల కితం సౌదీ అరేబియాకు ఉపాధి నిమిత్తం పనిచేసుకునేందుకు వెళ్లారు. రామారావు మృతి చెందాడని తెలిసి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువకునిపై దాడి

చికిత్స పొందుతున్న అప్పన్న

టెక్కలి రూరల్ : మండలంలోని చాకి పల్లికి చెందిన జలుమూరు అప్పన్నపై అదే గ్రామానికి చెందిన పంగ వెంకటరావు సోమవారం దాడి చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. అప్పన్న ఇంటి ఆవరణలో ఉన్న సమయంలోకి వచ్చి దాడి చేసినట్లు పేర్కొన్నారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారని అన్నారు. అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి అప్పారావు

గంజాయితో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కవిటి మండలంలో ఆర్.బెలగాం సమీపంలోని 16వ నంబరు జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి వద్ద సోమవారం గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 21.610 కిలోల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు, బైక్‌ను కవిటి పోలీసు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను కాశీబుగ్గ డిఎస్‌పి వి.వి. అప్పారావు ఇచ్ఛాపురం సిఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని గజపతి జిల్లా అటలిమాకు చెందిన బిర తన గ్రామస్తులైన తపన బిర్, ఆకాష్ బిర్, పిల్బా బర్ధన్ సాయంతో మహారాష్ట్రలో జల్నా ప్రాంతానికి చెందిన గంజాయి వ్యాపారి అశోక్ హివాల్ అలియాస్ రాజుకు గంజాయి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్.బెలగాం వద్ద కవిటి పోలీసులకు పట్టుబడారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కవిటి పోలీసులను అభినందించారు. కార్యక్రమంలో సిఐ చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ రవివర్మ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని మూడవ వార్డు ఊసవాని పేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు తురక పేటకు చెందిన అల్లు శ్రీనివాసరావు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు ఈనెల 20న ఊసవానిపేటలోని దుర్గాదేవి ఆలయం వద్ద రాత్రి 8 గంటల సమయంలో ఎపి30ఎఎస్ 8369 నెంబరు గల హెచ్‌ఎఫ్ డీలక్స్ ద్విచక్ర వాహనం నిలుపుదల చేసి 21వ తేదీ రాత్రి రెండు గంటల సమయంలో వాహనాన్ని నిలుపుదల చేసిన స్థలంలో చూసేసరికి కనిపించలేదని తెలిపారు. చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని పలుచోట్ల గాలించినప్పటికీ ఎక్కడ కనిపించక పోవడంతో సోమవారం శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ద్విచక్ర వాహనం చోరీపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు

లావేరు: మండలంలోని బుడుమురు సంత నుంచి బోలోరో వాహనంలో సోమవారం అక్రమంగా పశువులు తరలిస్తున్న వాహనాన్ని లావేరు పోలీసులు పట్టుకున్నారు. 13 పశువులను రణస్థలం మండలం కోస్టలో ఉన్న గోశాలకు అప్పగించి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని రెండు ప్రధాన రహదారులకు ఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుంచి రూ.3.80 కోట్లు మంజూరైనట్లు రోడ్లు భవనాల శాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొర్లకోట బిటి రోడ్డు నుంచి జంబుద్వీపం మీదుగా 0/0 నుంచి 1/8 కిలోమీటర్ల రహదారికి రూ.కోటి 85 లక్షలు, అలాగే కొర్లకోట బిటి రోడ్డు నుంచి ముద్దాడ పేట వరకు 1/8 కిలోమీటర్ల నుంచి 4/6 వరకు రహదారి నిర్మాణానికి రూ.కోటి 95 లక్షలు మంజూరైనట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రహదారి నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినందుకు సిఎం చంద్రబాబుకు, రోడ్లు భవనాల శాఖామంత్రి బిసి జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎఎన్‌యు ద్వారా దూరవిద్యా కోర్సులు

టెక్కలి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం ద్వారా అందిస్తున్న డిగ్రీ, పిజి కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందని ప్రణవి డిగ్రీ కళాశాల డైరెక్టర్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నౌపడ ఆర్ఎస్ దరి ప్రణవి దూరవిద్యా కేంద్రం ద్వారా 2025 కేలండర్ సంవత్స రానికి ఈ ప్రవేశాలు ఉంటాయన్నారు. యుజి కోర్సుల్లో బిఎస్సి, బిఎ, బికాం, పిజి, ఎంఎస్‌సి, ఎంఎ, ఎంకాం కోర్సులకు ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామని అన్నారు. మార్చి నెలాఖరు లోపు ప్రవేశాలు పొందాలని తెలి పారు. మరిన్ని వివరాలకు 9908297992, 94930 34488 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

'చింతాడ'ను అడ్డుకోవడం అమానుషం

బూర్జ: నెల్లిమెట్టలో జరుగుతున్న అక్రమ ఇసుక ర్యాంపులను పరిశీలించేందుకు వెళ్లిన వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్‌ను అడ్డుకోవడం అమానుషమని వైసిపి మండల నాయకులు ఖండాపు గోవిందరావు అన్నారు. కూటమి కార్యకర్తలు ఇలాంటి దుశ్చర్యలను పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. చవుకబారు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా టిడిపి మారిందని దుయ్యబట్టారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం, అధికార యంత్రాంగం రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కవితా సంకలనంలో
'కుప్పిలి' కవితకు స్థానం

వెంకట రాజారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస
కాలిఫోర్నియా నుంచి వెలువడిన అంతర్జాతీయ కవితా సంకలనంలో పట్టణానికి చెందిన కుప్పిలి వెంకట రాజారావు కవితకు స్థానం లభించింది. వీక్షణం సంచికలో 150 ఉత్తమ కవితల్లో రాజారావు రచించిన 'పతన సమాధిపై' కవిత ఒకటి. అలాగే కళా తపస్వి కె.విశ్వనాథ్ కళాత్మక చిత్రాలపై ఒక గ్రంథం రచిస్తున్నట్లు రాజారావు ఈ సందర్భంగా తెలిపారు.

సిసి కెమెరాల ప్రారంభం అనంతరం సూచనలు చేస్తున్న సిఐ

నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు

ప్రజాశక్తి- లావేరు
నేరాలు, ప్రమాదాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతగానో తోడ్పడతాయని జెఆర్ పురం సిఐ ఎం.అవతారం అన్నారు. సోమవారం జాతీయ రహదారి అదపాక కూడలిలో ఎస్‌పి మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన మూడు సిసి కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సిసి కెమెరాలు అదపాక కూడలిలో ఉన్న ఆటో డ్రైవర్లు, షాపుల వారి సహాయ సహకారాలుతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాహనదారులు అన్నీ జాగ్రత్తలు పాటిస్తూ నియమ నిబంధనల మేరకు వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు, స్థానికులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి
తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 425వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా సోమవారం దీక్షలో బొరివంక సభ్యులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వ పథకాలకు కూడా దూరమవుతున్నట్లు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అవగాహన కల్పిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా చేపట్టిన ఆర్థిక అక్షరాస్యతపై ఎపిఎం ఎం.ప్రసాదరావు సోమవారం అవగాహన కల్పించారు. అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను వివరించారు. జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష యోజన, పిఎం సూర్యఘర్ యోజన పథకాలను వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ లిలెన్త్ మిశ్రా, కార్యదర్శి సురేష్, సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

బెండి గెడ్డ పరిశీలన

డిఇతో మాట్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు
మండలంలోని బెండి గెడ్డను వంశధార డిఇ వి.సుధాకరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మాట్లాడారు. మినీ చెక్‌డ్యాం నిర్మించి కాలువ ద్వారా బెండి గెడ్డ వరద నీటిని సీతాపురం ఎర్ర చెరువు, పెద్దబొడ్డపాడు రామసాగరం, కొండవూరు చెరువుకు సాగునీరు అందించవచ్చని రైతులు డిఇ దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ చెక్‌డ్యాం నిర్మాణం వల్ల సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. బెండి గెడ్డలో వృథాగా వెళ్లిపోతున్న వరదనీటిని చెరువులకు మళ్లిస్తే సుమారు 800 ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని రైతులు వివరించారు. ఇక్కడ పరిశీలించిన విషయాలను వంశధార ఉన్నతాధికారుల దృష్టికి తీలుకెళ్తానని డిఇ వివరించారు. వాటర్ లెవెల్స్ ఆధారంగా ముందుకు వెళ్తామని అన్నారు. ఆయనతో పాటు ఎఇలు తమ్మినాన రాజశేఖర్, మీనాక్షి, పెద్దబొడ్డపాడు సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు, డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షుడు గొనప నిరంజన్, నీటి సంఘాల అధ్యక్షులు దాసరి దాశరథి, దువ్వాడ అప్పారావు, బాలకృష్ణ, టి.జయరాం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇళ్ల స్థలాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జగనన్న కాలనీలో పర్యటిస్తున్న తహశీల్దార్ మధుసూధనరావు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి
ప్రభుత్వం నిరుపేద లబ్ధిదారులకు మంజూరు చేసిన జగనన్న కాలనీ ప్రభుత్వ స్థలాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ ఎల్.మధుసూదన్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన సరుబుజ్జిలిలో లబ్ధిదారులకు మంజూరు చేసిన నందికొండ జగనన్న కాలనీ లేఔట్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ నందికొండ కాలనీలో కొంతమంది ప్రభుత్వం మంజూరు చేసిన ఖాళీ స్థలాలు, పునాదులు నిర్మాణం జరిపిన వివిధ దశల్లో ఉన్న ఇల్లు ఇళ్ల స్థలాలను అమ్మకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నిజమైన లబ్ధిదారుడు ఇంటి స్థలంలో లేకపోతే అటువంటి ఇంటి స్థలాన్ని రద్దు చేసి ఇల్లు లేని కొత్త లబ్ధిదారులకు మంజూరు చేస్తామన్నారు. విచారణ అనంతరం క్రయ విక్రయాలు జరిపిన వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ హెచ్చరించారు. ఈయనతో విఆర్ఒ విశ్వనాథం, రెవెన్యూ సిబ్బంది వరం పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

నగదు అందిస్తున్న గ్రామ పెద్దలు

ప్రజాశక్తి- కవిటి
అభాగ్యులకు అండగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఉంటుందని కలాం ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. మండలంలోని కొమ్ముపుట్టుగకు చెందిన బైరెడ్ల మాధవ్ ఉపాధి నిమిత్తం వలస వెళ్లి అక్కడ అనారోగ్యానికి గురయ్యారు. మాధవ్ తల్లి కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో విషయం తెలుసుకున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు గ్రామానికి చేరుకుని వారికి భరోసా ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని కిస్టుపురంలో టిడిపి నాయకులు బుర్లె ఢిల్లేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీశయన సాధికారిక రాష్ట్ర మెంబరు బూరెలు సూర్య కృష్ణంరాజు ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరికి ఢిల్లేశ్వరరావు పరిస్థితి వివరించారు. వారు స్పందించి రూ.50 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు.

కళాశాలకు పేరు తీసుకురావాలి

మాట్లాడుతున్న హెచ్‌ఎం నిర్మల

ప్రజాశక్తి- కొత్తూరు
విద్యార్థులు బాగా చదివి కళాశాలకు అధ్యాపకులకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.ఆదినారాయణ అధ్యక్షతన ఇంటర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇంటర్మీడియట్ భవిష్యత్‌లో ఏది అవ్వాన్నది నిర్ణయిస్తుందని, దానికి అనుగుణంగా ముందుకు పోవాలని సూచించారు. విద్యార్థులు మాట్లాడుతూ మౌలిక వసతులు లేనప్పటికీ అధ్యాపకులు మంచి బోధన అందడంతో విజయాలను సమయాసంగా అందుకుంటామన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే విద్యార్థులు నృత్యాలతో సబికులను ఆనందపరిచారు. ఎంపిటిసి బిల్లింగ్ సంజీవరావు, మాజీ సర్పంచ్ టంకాల రమణా రావు, ఎంపిటిసి మాజీ రాడ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఎండల మల్లన్న ముస్తాబు

ముస్తాబవుతున్న ఆలయం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్
శివరాత్రి జాతరకు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం, రావివలస ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 26న ప్రారంభం కానున్న శివరాత్రి 28న స్నానాల ఘట్టంతో ముగుస్తుంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచీ యాత్రికులు వస్తారని కార్య నిర్వహణాధికారి జి.గురునాథరావు అంచనా వేస్తున్నారు. యాత్రికులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఒ తెలిపారు. క్యూలైన్లు ఎక్కువ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టెక్కలి ఆర్‌టిసి నుంచి ప్రత్యేక బస్సులు, వైద్య శిబిరాలు, తాగునీరు అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. ఆర్‌టిసి, విద్యుత్, పోలీసుల సమన్వయంతో యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతారని తెలిపారు. ఆలయ ఆవరణలో పోలీసులు సిసి కెమెరాలు అమర్చనున్నారని అన్నారు. ఈ నెల 25 అర్ధరాత్రి లింగోద్భవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

'తెరవే' సభ్యుల గ్రంథాల ఎంపిక

ప్రజాశక్తి- అరసవల్లి
తెలుగు రచయితల వేదికకు చెందిన ముగ్గురు సభ్యులు రాసిన పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ (మంగళగిరి) సంచాలకులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయాన్ని తెలుగు రచయితల వేదిక (తెరవే) అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు రాసిన 'గ్రామ నామాలు' (ఆంధ్రప్రదేశ్), లలితా రెడ్డి రాసిన 'లలిత కథా సాగరం' (బాలల కథా సంపుటి), కూన రంగనాయకులు రాసిన 'ఆఖరిమెట్టు' (నవల) ఎంపికైనట్టు వివరించారు. ఈ పుస్తకాలకు సంబంధించి సైటేషన్ నెంబర్లను కూడా కేటాయించారు. ఈ సందర్భంగా తెరవే అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పుస్తక రచయితలను అభినందించారు.

పరిసరాలు శుభ్రం చేస్తున్న ఎంఇఒ, సిబ్బంది

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- రణస్థలం
పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని ఎంఇఒ ఎ.త్రినాథరావు అన్నారు. సోమవారం ఎంఇఒ కార్యాలయం వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో పర్యటించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యార్థినులకు కిట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి
ఏకాగ్రతతో మనసు పెట్టి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చునని ప్రిన్సిపాల్ కత్తిరి రామకృష్ణారావు విద్యార్థినులకు సూచించారు. సోమవారం మండలంలోని రొట్టవలస హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపిసి, బైపిసి విద్యార్థులకు జరిగే ఫేర్వెల్ ఫంక్షన్‌లో పాల్గొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తగు సూచనలు, సలహాలను ఉపాధ్యాయులు అందించారు. ప్రతి ఒక్క విద్యార్థికి హాల్ టికెట్‌తో పాటు అట్ట, పెన్నులు, పెన్సిళ్లుతదితర వస్తువులతో కూడిన కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై సమీక్ష

ప్రజాశక్తి- నందిగాం
మండలంలో ఉపాధి హామీ ద్వారా 2024లో నిర్వహించిన రూ.22,80,24,356 పనులపై మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహి స్తారని ఎపిఒ నాగరాజు, ఎస్ఆర్‌పి తిరుపతిరావు తెలిపారు. ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, డిఆర్‌పిలు, ఎస్ఆర్‌పి సోమవారం సమీక్షించారు. అనంతరం మస్టర్‌షీట్లను అందజేశారు.